సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం ౹ 30 ౹ జూన్ ౹ 2024

గరిష్టం/కనిష్టం
34.7/23.2

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఐతోలు టు బాలీవుడ్

'కల్కి 2898 ఏడీ' అద్భుతమైన సైన్స్ విజువల్ సినిమాతో ప్రపంచ ప్రేక్షకుల మన్ననలు అందుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న ఈ చిత్ర దర్శకుడు మన పాలమూరు బిడ్డే. బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, రెబల్‌స్టార్ ప్రభాస్, కమల్‌హాసన్, దీపికా పదుకొణే, విజయ్ దేవరకొండ, దిశా పటానీ, దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్, మాళవిక నాయర్ వంటి టాప్‌స్టార్లతో రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలై.. భారీ హిట్‌గా దూసుకెళుతోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా ఐతోలులో పండుగ వాతావరణం నెలకొంది.
- సాక్షి, నాగర్‌కర్నూల్/తాడూరు



'కల్కి 2898 ఏడీ' సినిమా దర్శకుడు మనోడే

- నాగ్ అశ్విన్‌ది నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోలు
- డైరెక్టర్‌గా ఎవడే సుబ్రమణ్యంతో టాలీవుడ్‌కు పరిచయం
- మహానటి చిత్రంతో జాతీయస్థాయిలో గుర్తింపు
- ప్రస్తుతం కల్కి సినిమాకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

దర్శకుడిగా మూడో సినిమానే హాలీవుడ్ తరహా చిత్రీకరణతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న నేపథ్యంలో అందరి దృష్టి నాగ్ అశ్విన్‌పై పడింది. దీంతో సినిమా డైరెక్టర్ గురించి తెలుసుకునేందుకు నెటిజన్లలో ఆసక్తి పెరుగుతోంది. తాడూరు మండలం ఐతోలు గ్రామానికి చెందిన నాగ్ అశ్విన్ తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే. ఆయన తండ్రి డాక్టర్ సింగిరెడ్డి జయరాంరెడ్డి హైదరాబాద్‌లో యూరాలజిస్ట్‌గా, తల్లి జయంతిరెడ్డి గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. వృత్తిరీత్యా వారు హైదరాబాద్‌కు వెళ్లినా.. గ్రామంలో సొంతిల్లు, దగ్గరి బంధువులు చాలా మందే ఉన్నారు. కుటుంబ, ఇతర శుభకార్యాలు ఉన్నప్పుడు అందరూ ఐతోలుకు వచ్చి వెళుతుంటారు.


ఐతోలులో డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇల్లు



సండే స్పెషల్

■ హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో చదువుకున్న నాగ్ అశ్విన్‌కు చిన్నప్పటి నుంచి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నిర్మూలనపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. మాస్ కమ్యూనికేషన్స్, జర్నలిజంలో బ్యాచిలర్స్ పూర్తి చేశాడు. ఆ తర్వాత న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో డైరెక్షన్ కోర్సు చేశాడు. సినిమాలకు దర్శకత్వం వహించాలనే లక్ష్యంగా 'నేను మీకు తెలుసా?' చిత్రానికి తొలి సారిగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన అశ్విన్.. ఆ తర్వాత శేఖర్ కమ్ముల దగ్గర లీడర్, లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తూనే.. ఆ చిత్రాల్లో చిన్నపాత్రలు సైతం వేశారు. అయితే 2013లో రచయిత, దర్శకుడిగా తీసిన ఇంగ్లిష్ లఘు చిత్రం 'యాదోం కీ బరాత్' కేన్స్ షార్ట్ ఫిల్మ్ కార్నర్‌కు ఎంపికైంది. అనంతరం 2015లో 'ఎవడే సుబ్రమణ్యం' దర్శకుడిగా పరిచయమై సూపర్ హిట్‌తో తొలి చిత్రానికే నంది అవార్డు అందుకున్నారు. అదే ఏడాది వైజయంతి మూవీస్ అధినేత, నిర్మాణ అశ్వినిదత్ కుమార్తె ప్రియాంకను వివాహం చేసుకున్నారు. 2018లో అలనాటి హీరోయిన్ సావిత్రి బయోపిక్‌గా తీసిన 'మహానటి' సినిమా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు నిచ్చింది. 'బయోపిక్'లో కొత్త ఒరవడి సృష్టించిన ఈ చిత్రం 66వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో ఉత్తమ తెలుగు సినిమాగా ఎంపికైంది. వీటితో పాటు 2021లో వచ్చిన పిట్టకథలు వెబ్ సిరీస్‌లో 'ఎక్స్‌లైఫ్' సిగ్మెంట్‌కు దర్శకత్వం వహించారు. అలాగే అదేఏడాది తెలుగులో సూపర్ హిట్ అయిన జాతిరత్నాలు సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు. తాజాగా ఇండియాలోనే భారీ బడ్జెట్ రూ.600తో తీసిన పురాణ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' చిత్రం రికార్డులు కొల్లగొడుతోంది.


నాగ్ అశ్విన్, ప్రియాంక పెళ్లి వేడుక (ఫైల్)


ఐతోలు గ్రామ వ్యూ

స్వగ్రామంలో హర్షాతిరేకాలు

దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన సినిమా ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తుండటం, ఘన విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆయన స్వగ్రామం తాడూరు మండలం ఐతోలులో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంతో పాటు జిల్లాకేంద్రంలోనూ ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ సంతోషాన్ని చాటుకుంటున్నారు. నాగ్ అశ్విన్ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడినా సొంత ఊరిపైనున్న మమకారాన్ని వదులుకోలేదు. గ్రామంలో సాయిబాబా ఆలయాన్ని నిర్మించి, నిర్వహణ బాధ్యతలను కూడా వారే చూసుకుంటుండటం గమనార్హం.



ఏళ్ల నాటి కల నెరవేర్చుకున్నాడు..



మంచి దర్శకుడిగా ఎదగాలన్న తన ఏళ్ల నాటి కలను నాగ్ అశ్విన్ నెరవేర్చుకున్నాడు. కల్కి సినిమా పార్ట్–1 విజయవంతమై అందరి ప్రసంశలు అందుకుంది. భవిష్యత్‌లోనూ ఈ విజయాల పరంపర కొనసాగాలి. సినిమా గొప్ప విజయం సాధిస్తున్నందుకు సంతోషంగా ఉంది.
- డాక్టర్ జయంతిరెడ్డి, నాగ్ అశ్విన్ తల్లి

ఇంకా గొప్ప విజయాలు సాధించాలి..



ఐతోలు గ్రామానికి చెందిన నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన కల్కి సినిమా భారీ విజయాన్ని అందుకోవడం సంతోషంగా ఉంది. ఆయన విజయం మాకు అందరికీ గర్వకారణం. భవిష్యత్‌లోనూ గొప్ప సినిమాలు చేయాలని, దర్శకుడిగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాం.
- హరికృష్ణ శర్మ, ఐతోలు, తాడూరు మండలం


వనపర్తిలోని రాజీవ్ చౌక్‌లో సంబరాలు చేసుకుంటున్న యువత

జయహో భారత్

- టీమిండియా విజయంతో ఉమ్మడి జిల్లాలో గెలుపు సంబరాలు
- టపాసులు కాల్చి.. సందడి చేసిన క్రికెట్ అభిమానులు


పాలమూరులో కేక్ కట్ చేస్తున్న యువత

మహబూబ్‌నగర్ క్రీడలు: ఓ వైపు పాలమూరులో జోరు వాన.. మరోవైపు టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. రాత్రి 11 గంటలు దాటినా టీవీలు.. మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయారు అభిమానులు. బంతి బంతికి నరాలు తెగే ఉత్కంఠ. 17ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కరేబియన్‌గడ్డపై దక్షిణాఫ్రికాను ఓడించిన టీమిండియా పొట్టి క్రికెట్ చాంపియన్‌గా నిలిచింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. యువత ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి బాణసంచా పేల్చుతూ సంతోషంతో గెంతులేశారు. కేకులు కట్ చేశారు. 'జయహో భారత్..' అంటూ జాతీయ జెండాలతో బైకులపై చక్కర్లు కొట్టి సందడి చేశారు. ఈ విజయం యువ క్రికెటర్లకు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు.



చాలా సంతోషంగా ఉంది..



17 ఏళ్ల తర్వాత టీ–20 ప్రపంచకప్‌ను భారత జట్టు గెలుపొందడం సంతోషంగా ఉంది. ఇప్పుడు క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఈ విజయంతో మరింత మంది యువత క్రికెట్‌పై ఆసక్తి చూపుతారు.
- ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

కోహ్లి సూపర్‌గా ఆడాడు



ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి చాలా బాగా ఆడాడు. గత రెండేళ్ల నుంచి క్రికెట్ శిక్షణ తీసుకుంటున్నా. ఇండియా ప్రపంచ కప్ గెలిచినందుకు సంతోషంగా ఉంది.
- షేక్ ఫర్హాన్, యువ క్రికెటర్, మహబూబ్‌నగర్

సమష్టి కృషితో విజేతగా నిలిచారు



టీ–20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి కృషితో ఆడి చాంపియన్‌గా నిలిచింది. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ అమోఘం. ఇండియా కప్ గెలిచినందుకు చెప్పలేని ఆనందంగా ఉంది.
- గణేష్, క్రికెటర్, మహబూబ్‌నగర్

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: జిల్లా వ్యాప్తంగా పెండింగులో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం సీసీఎల్‌ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన జిల్లాలోని వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లతో మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఐ పట్టాపాస్‌పుస్తకం, కోర్టుకేసు, డాటా కరెక్షన్, జీపీఏ, ప్రొహిబీటెడ్, నూతన పట్టాపుస్తకాలు, నాలా, ఖాతా మార్పిడి, భూసంబంధిత ఫిర్యాదులు నాలా పీపీబీ, పెండింగ్ మ్యూటేషన్లు, సక్సెషన్, అర్బన్ ల్యాండ్స్ వంటి ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాములు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తే ప్రజల మనసులో శాశ్వతంగా గుర్తిండిపోతారని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశం హాలులో సూపరింటెండెంట్ గా పనిచేసిన ధనుంజయ్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏవో వీరభద్రప్ప, అధికారులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలులోకి వస్తున్నాయని, ఎవరికీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతిఒక్కరూ అన్ని సెక్షన్లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కేసుల విచారణ, విధి విధానాలు, విచారణ పద్ధతులు, శిక్షలలో మార్పు ఉంటుందని అన్నారు. ప్రజలకు మరింత వేగంగా సమర్థవంతం సేవలందించేందుకు ఈ కొత్త చట్టాలు వీలుగా ఉంటాయన్నారు. అలాగే, ప్రతి కేసును పక్కాగా విచారణ జరపాలని, సాక్షుల వాంగ్మూలం తదితర సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. సీసీటీఎన్‌ఎస్ ఆన్‌లైన్‌లో ప్రతి అంశాలను రైటర్స్ అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో సీఐలు రత్నం, బీమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

హాస్టళ్ల తరలింపు ప్రయత్నాన్ని విరమించుకోవాలి


ఆర్‌ఐకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, విద్యార్థులు

అలంపూర్: ఇంటర్ హాస్టళ్ల తరలింపు ప్రయత్నాలు విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఇంటర్ హాస్టల్స్‌ను తరలించవద్దని నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ కరీంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అలంపూర్ మున్సిపాలిటీలో 2008 బాలికల వసతి గృహాన్ని, 2009లో బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏళ్ల తరబడిగా కొనసాగుతున్న ఈ వసతి గృహాలను అయిజకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అలంపూర్‌కు వచ్చిన డిగ్రీ కళాశాలను మరో మండలానికి తరలించారని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు హాస్టల్స్‌ను తరలించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. న్నారని విమర్శించారు. హాస్టళ్లలో అడ్మిషన్స్ ప్రారంభించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహ్మా, అయ్యప్ప, సిద్దయ్య, ఆశన్న, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బెల్టు షాపులను ఎత్తివేయాలి

గద్వాల రూరల్: మహిళలపై హింసకు కారణమవుతున్న బెల్టు షాపులను ఎత్తివేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉన్న బెల్టు షాపులపై సర్వే చేసి అధికారులకు తెలియజేస్తామని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పావలా వడ్డీ రుణాలను వెంటనే విడుదల చేయాలని, అభయ హస్తం పథకానికి విధి విధానాలు రూపొందించి గతంలో కట్టిన వారి వివరాల ఆధారంగా కొనసాగించాలని, కొత్త వారికి కూడా ఈ పథకంలో అవకాశం కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, టెస్టుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మద, నాయకులు మరియమ్మ, జయమ్మ, మాధవి, దేవమ్మ, శివమ్మ తదితరులు ఉన్నారు.

అన్నదాన సత్రానికి రూ.1.22లక్షల విరాళం

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలకు వచ్చే భక్తుల నిత్యాన్నదాన సత్రానికి హైదరాబాద్ విద్యాశాఖ ఏడీ సులోచన పుష్పేందర్ శనివారం రూ.1,22,649 చెక్‌ను అందజేశారు. అలాగే, ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాపికప దర్శించుకున్నారు.

కార్గో పరుగులు

- ఆర్టీసీ లాజిస్టిక్ సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన
- పార్సిల్, కొరియర్ సేవలకు నాలుగేళ్లు పూర్తి
- ఈనెల 28 వరకు రూ.17.26 కోట్ల ఆదాయం
- ఇప్పటివరకు 14.37 లక్షల పార్సిల్ బుకింగ్
- కార్గో బస్సుల ద్వారా రూ.34.53 లక్షల ఆదాయం
- ఆదాయంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మహబూబ్‌నగర్, గద్వాల డిపోలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో ప్రవేశపెట్టిన లాజిస్టిక్ (కార్గో, పార్సిల్) సేవలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. అనతికాలంలోనే పార్సిల్ కార్గో సర్వీస్‌కు విశేష స్పందన లభిస్తోంది. దీంతో రోజురోజుకు కార్గో పార్సిల్ ఆదాయం పెరుగుతోంది. 2020, జూన్ 19వ తేదీన ప్రారంభించిన ఆర్టీసీ కార్గో, పార్సిల్ సేవలకు నాలుగేళ్లు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని 3 కేంద్రాలు, 42 పీసీసీ ఏజెంట్ల ద్వారా 2020, జూన్ 19 నుంచి ఈ ఏడాది ఈ నెల 28వ తేదీ వరకు కార్గో పార్సిల్ సేవల ద్వారా రూ.17,26,18,367ల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా 14,37,896 పార్సిల్, కొరియర్ బుకింగ్స్‌తో ఈ ఆదాయం పొందింది. నిత్యం వెయ్యికిపైగా పార్సిల్, కవర్లను ఒక బస్టాండ్ నుంచి మరో బస్టాండ్లకు చేరవేస్తున్నారు. పార్సిల్ సేవల్లో మహబూబ్‌నగర్ డివిజన్ రూ.13,52,13,402లు, నాగర్‌కర్నూల్ డివిజన్ రూ.3,74,04,965ల ఆదాయాన్ని పొందింది. ప్రతి రోజు రీజియన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.

రీజియన్‌లో మహబూబ్‌నగర్ అగ్రస్థానం

కార్గో సేవలకు సంబంధించి రీజియన్‌లోని 10 డిపోల్లో మహబూబ్‌నగర్, గద్వాల డిపోలు కార్గో సేవల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ డిపో కార్గో పార్సిల్ కొరియర్ ఆదాయంలో ముందంజలో ఉంది. మహబూబ్‌నగర్ డిపో ఇప్పటివరకు రూ.4,90,79,135, గద్వాల డిపో రూ.4,65,37,628ల ఆదాయం వచ్చింది. గత ఏడాది గద్వాల డిపో రూ.2కోట్ల 74లక్షల ఆదాయం ఉండగా ఈ ఏడాది మెరుగైన పురోగతి సాధించడం విశేషం. అదే విధంగా రీజియన్‌లో కార్గో బస్సుల ద్వారా కూడా సేవలు అందజేస్తున్నారు. ఆర్టీసీ కార్గో బస్సు సేవలను 2020, జూలై మొదటి వారంలో ప్రారంభించగా.. ఇప్పటివరకు రూ.34,53,313ల ఆదాయం వచ్చింది.


వనపర్తిలోని ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రం

డిపో	కార్గో ఆదాయం (రూ.లలో)
మహబూబ్‌నగర్	4,90,79,135
గద్వాల	4,65,37,628
వనపర్తి	1,54,45,988
నారాయణపేట	1,26,78,343
నాగర్‌కర్నూల్	1,20,29,628
షాద్‌నగర్	1,14,72,309
కల్వకుర్తి	1,01,57,018
కొల్లాపూర్	76,63,128
అచ్చంపేట	75,55,191

వినూత్న సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన...

ఆర్టీసీ కార్గోలో వినూత్న సేవలు చేపట్టారు. సమ్మక్క, సారక్క జాతరను పురస్కరించుకొని భక్తులకు మేడారాం ప్రసాదాన్ని అందించారు. మూడేళ్ల నుంచి శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఇంటివద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు అనే కార్యక్రమాలు చేపట్టగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,708 బుకింగ్ చేసుకున్న మందికి ఇంటివద్దకే ప్రసాదాన్ని అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు



ఆర్టీసీ లాజిస్టిక్ సేవలపై ప్రజల్లో విశేష స్పందన లభిస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. త్వరలో జిల్లాల్లో హోండెలివరీ సేవలు కూడా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో ఏజెంట్ల నియామకం చేపడుతాం. ప్రజలు ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
- ఎన్.దేవేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల ఏటీఎం లాజిస్టిక్

మండలస్థాయిలో లాజిస్టిక్ సేవలను విస్తృతం చేస్తాం



ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను మండలస్థాయిల్లో మరింతగా విస్తృతం చేస్తాం. లాజిస్టిక్‌లో సీబీబీ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చాం. ఆసక్తిగల వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవాలి. మిగతా వివరాల కోసం లాజిస్టిక్ కేంద్రాల్లో సంప్రదించాలి.
- ఎన్.శ్రీధర్, రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

వృద్ధుడి బలవన్మరణం

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ చెందిన గొల్ల మల్లయ్య(60) గ్రామ సమీపంలోని అడవిలో చెట్టుకు ఉరేసుకున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆచూకీ ఎక్కడా లభ్యం కాలేదు. శనివారం సమీప అడవిలో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు బోల్తాపడి యువకుడు మృతి

కొల్లాపూర్ రూరల్: కారుబోల్తా పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకిరావుపల్లికి చెందిన పెద్దాపురం నవీన్ (20)శుక్రవారం వనపర్తిలో శుభకార్యానికి హాజరయ్యాడు. రాత్రి ఇంటికి కారులో తిరిగి వస్తుండగా తమ బంధువులను కల్వకోలులో వదిలి రాత్రి 11 గంటలకు గ్రామానికి బయలుదేరాడు. గ్రామ సమీపంలో కొల్లాపూర్ ప్రధానరహదారిపై కారు కల్వర్టును ఢీకొట్టి బోల్తాపడింది. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. తెల్లవారుజామున గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్పటికే నవీన్ కారులోనే మృతి చెందాడు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..

నవాబుపేట: మండలంలోని అమ్మపూర్ చెందిన సంగెం రామస్వామి (27) ఈ నెల 25న మండల కేంద్రం నుంచి అమ్మపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. గాయాలు కావడంతో అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమించటంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య అలవేలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. కాగా అతివేగంగా రాళ్ల లోడుతో వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం మూలంగానే ఈ ప్రమాదం జరిగిందని తమకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంది.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బల్మూర్: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఇందిర తెలిపారు. అచ్చంపేటకు చెందిన బుద్దుల అలివేల, బాలస్వామి కూతురు తెలకపల్లిలో రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతంది. ఈనెల 8న బల్మూర్ మండలంలోని కొండనాగులలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వచ్చి 10వ తేదీన తిరిగి వెళ్లింది. ఇంటికి చేరుకోక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటు కోళ్లు మృతి

గండేడ్: గుర్తుతెలియని జంతువు దాడిలో నాటు కోళ్లు మృతి చెందాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మన్సూర్‌పల్లి పంచాయతీలో కామాస్‌కుంటకు చెందిన కొత్లాబాద్ శ్రీనివాస్ నాటు కోళ్ల పెంచేందుకు రెండు నెలల క్రితం షెడ్డు నిర్మించాడు. హన్వాడ, కోయిల్‌కొండ, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో తిరిగి నాటుకోళ్లు సేకరించి షెడ్డులో ఉంచాడు. వాటికి దాణా వేస్తూ పెంచుతూ వచ్చాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం వాటికి దాణా వేసి షెడ్డు మూసేశాడు. ఉదయం 7గంటలకు షెడ్డు వద్దకు వెళ్లి చూడగా కోళ్లు చనిపోయి ఉన్నాయి. మొత్తం 110 కోళ్లు ఉండగా అందులో రెండు మాత్రం బతికి ఉన్నాయి. అన్ని కూడా తలలు కొరికివేయబడి ఉండగా ఒకటి రెండు మాత్రం తినబడి ఉన్నాయి. ఒక్కో కోడి సుమారు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ధర పలుకుతుండేదని బాధితుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ..

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ చెందిన మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్య లేగదూడపై చిరుత దాడి చేసినా ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని తన పొలంలో లేగదూడను కట్టేసి రాగా, శనివారం ఉదయం వెళ్లేసరికి మృతి చెందినట్లు తెలిపారు. చిరుత పులి చంపి తిన్నట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏప్రిల్ నెలలో గోకుల్‌నగర్, నందిగామ, దుప్పట్‌గట్టు గుట్టల ప్రాంతంలో వరుసగా చిరుతదాడిలో లేగదూడలు చనిపోయాయి. దీంతో అటవీశాఖ అధికారుల బోను ఏర్పాటు చేస్తే ఒక చిరుత చిక్కిన విషయం పాఠకులకు తెలిసిందే. ఇంకా ఈ మండలంలో నాలుగు చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులే తెలియజేశారు.

హుండీ పగులగొట్టి నగదు చోరీ

గట్టు: మండలంలోని చాగదోణ రేణుక ఎల్లమ్మ ఆలయంలోని హుండి డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ఎత్తుకెళ్లారు. మిట్టదొడ్డి–చాగదోణ మధ్య ఉన్న రేణుక ఎల్లమ్మవ్వ ఆలయం ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపులకు ఉన్న తాళాలను విరగొట్టి, అందులోని హుండీ పగుల గొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం ఆలయానికి చేరుకున్న పూజారి విషయాన్ని గమనించి, గ్రామస్తులతో పాటుగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దేవాలయానికి చేరుకుని వివరాలను సేకరించారు.

సీరియల్ కిల్లర్ అరెస్టు

ఆరు హత్య కేసుల్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- అడ్డా కూలీలను లక్ష్యంగా చేసుకొని అఘాయిత్యం
- డబ్బులిస్తానని ఆశ చూపి.. లైంగిక దాడి చేసి.. ఆపై అంతమొందించడం
- హంతకుడిని పట్టించిన ఆధార్ కార్డు
- టీడీ గుట్ట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు చిక్కిన వైనం
- వేర్వేరు ప్రాంతాల్లో హత్య చేసినట్లు ఒప్పుకున్న నిందితుడు
- వివరాలు వెల్లడించిన పాలమూరు ఎస్పీ డి.జానకి



మహబూబ్‌నగర్ క్రైం: చెడు వ్యసనాలకు అలవాటు పడిన ఓ 25 ఏళ్ల ఆ యువకుడు.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఆరు హత్యలు చేసి ఎవరికి చిక్కకుండా దర్జాగా తిరిగాడు. అడ్డపైకి వచ్చే మహిళ కూలీలను లక్ష్యంగా చేసుకుని.. డబ్బులు ఇస్తానని ఆశ చూపి లైంగిక దాడి చేసి.. ఆపై హత్యలు చేస్తున్న సీరియల్ కిల్లర్‌ను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పాలమూరు ఎస్పీ డి.జానకి వెల్లడించారు.

'గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన బోయ కాశి రెండేళ్ల క్రితం గ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. పలు రకాల కూలీ పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బులతో మద్యం తాగడానికి ఖర్చు చేసి.. ఫుట్‌పాత్‌లపై, బస్టాండ్‌లలో పడుకునేవాడు. తాగుడు, ఇతర చెడు అలవాట్లకు బానిసైన అతను అడ్డాలలో కూలీ పనుల కోసం వచ్చే మహిళలను లక్ష్యంగా చేసుకుని డబ్బులు ఇస్తానని ఆశ చూపి నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి.. శారీరకంగా వాడుకొని.. ఆ తర్వాత వారికి డబ్బులు ఇవ్వకుండా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే మే 23న జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట అడ్డా పైకి కూలీ పనుల కోసం వచ్చిన గాజులపేటకు చెందిన దాసరి లక్ష్మీని డబ్బులు ఇస్తానని చెప్పి ఆమెను అమిస్తాపూర్ సమీపంలో కొత్తగా నిర్మాణంలో ఇంటి లోపలికి తీసుకువెళ్లి శారీరకంగా కలిశారు. ఆ తర్వాత దాసరి లక్ష్మి(33) డబ్బులు ఇవ్వాలని అతనిని అడగటంతో.. ముందే వేసుకున్న పథకం ప్రకారం రాత్రి 11 గంటల ప్రాంతంలో అతని దగ్గర ఉన్న టవల్‌తో ఆమె మెడకు బిగించి, బ్లేడ్‌తో గొంతుకోసి... ఆ తర్వాత పక్కనే ఉన్న రాయితో తల, ముఖంపై దాడిచేసి హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె కాళ్లకు ఉన్న వెండి పట్టీలు తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి సంఘటన స్థలంలో దొరికిన ఆధార్ కార్డుతో పాటు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్న క్రమంలో శనివారం ఉదయం టీడీగుట్ట దగ్గర ఉన్న బస్టాండ్ దగ్గర అనుమానాస్పదంగా కన్పిస్తే అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. అమిస్తాపూర్‌లో లక్ష్మి హత్యతో పాటు గతంలో చేసిన ఐదు హత్యలు చేసినట్లు వెల్లడైంది.' అని ఎస్పీ తెలిపారు.

రూ.3వేల కోసం మరో హత్య

'గతేడాది భూత్పూర్‌లో పరిధిలో అమిస్తాపూర్ దగ్గర జరిగిన మున్నూర్ మల్లేష్(45) హత్య ఇతనే చేశాడని తేలింది. కూలీ పని దగ్గర మున్నూర్ మల్లేష్‌కు బోయ కాశీకి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మల్లేష్ వద్ద ఉన్న రూ.3వేలను దొంగలించేందుకు బాగా మద్యం తాగించి.. ఆ తర్వాత గ్రానైట్ రాయితో కొట్టి హత్య చేశాడు.'అని ఎస్పీ పేర్కొన్నారు. వీటితో పాటు 2022లో మహబూబ్‌నగర్ రూరల్ మండలం జైనల్లిపూర్‌కు చెందిన సీతమ్మ(40)ను, హన్వాడ, వనపర్తి, బిజినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ముగ్గురు గుర్తు తెలియని మహిళలను శారీరకంగా వాడుకొని హత్య చేసినట్లు తేలిందన్నారు. ఇంకా ఎన్ని కేసుల్లో ఉన్నాడో అనే అంశంపై విచారణ చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డ్‌లు అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డి.జానకి, చిత్రంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు

విచ్చలవిడిగా గంజాయి లభ్యం!


వట్టెం శివారులో హత్యకు గురైన మహిళ (ఫైల్)

- మత్తులో జోగుతున్న బిజినేపల్లి
- హత్యలకు దారి తీస్తున్న వైనం
- చూసి చూడనట్లుగా పోలీస్, ఎక్సైజ్ శాఖలు

బిజినేపల్లి: మండలంలో గంజాయి విచ్చలవిడిగా రాజ్యమేలుతుంది. అలవాటుగా మారడం మాట అటుంచితే ఏకంగా హత్యల వరకు దారి తీస్తున్నాయి. ఇలాంటి ఘటనలు మండలంలోనే చోటు చేసుకోవడం కోసమెరుపు.

- వట్టెం శివారు వ్యవసాయ పొలంలో ఏప్రిల్ 7వ తేదీ రాత్రి గిరిజన మహిళ హత్య కేసులో మండల కేంద్రానికి చెందిన నిందుతుడికి గంజాయితో సంబంధాలు ఉన్నాయి. ఆ వ్యక్తి తాను గంజాయి సేవించడంతో పాటు తన సహచరులకు సరఫరా చేస్తుంటాడని తేలింది.
- రెండేళ్ల కిందట మండల కేంద్రంలోనే నందివడ్డెమాన్ కమాన్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో గొడవ పడి అందులో ఒక యువకుడు హత్యకు గురయ్యాడు. వీరు గంజాయి మత్తులోనే దాడి చేసుకున్నారని సన్నిహితులు తెలిపారు.
- మూడేళ్ల క్రితం తండ్రినే కోడుకు గంజాయి మత్తులో మధ్యరాత్రి రోకలిబండతో కొట్టి చంపాడు.
- వెలుగులోకి వచ్చిన ఘటనలు కొన్ని అయితే, రాకుండా ఉన్నవి మరెన్నో. ఏడాది క్రితం బిజినేపల్లి మండల కేంద్రానికి సమీపంలో అల్ప్రాజోలం తయారీ చేస్తూంటే డీఆర్‌ఐ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకుని వెళ్లిపోయాక స్థానిక ఎక్సైజ్, పోలీసు అధికారులు తేరుకున్నారు. వారం రోజుల క్రితం గుడ్లనర్వలో ఇద్దరు యువకులు సిగరెట్లలో గంజాయి నింపి తాగుతుంటే జిల్లా కేంద్రం నుంచి వచ్చిన సమాచారంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని పాలెం, వట్టెం, మంగనూర్, బిజినేపల్లి, గుడ్లనర్వ, కారుకొండ, ఖానాపూర్, నందివడ్డెమాన్‌లో గంజాయి సరఫరా అవుతుందని, స్థానిక పోలిసు అధికారుల దృష్టిలో ఉన్నా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ గంజాయి వట్టెం జలాశయం సమీప గ్రామాల గుండా ఇతర గ్రామాలకు సరఫరా అవుతుందని ఆరోపణలు ఉన్నాయి.


గంజాయి పాకెట్లు

గంజాయి కేసుల్ని ఛేదిస్తున్నాం

గంజాయి సేవిస్తున్న యువకుల్ని ప్రత్యేకంగా గుర్తించి వారిపై కేసు నమోదు చేయటమే కాకుండా ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో ఛేదిస్తున్నాం. గంజాయి మాత్రమే కాకుండా పేకాట, ఇతర మత్తు పదార్థాలపై ఎలాంటి సమాచారం ఇచ్చినా వారి పేర్లు గోప్యంగా ఉంచి కేసులు నమోదు చేస్తాం. అంతేకాక గంజాయి నిర్మూలన కోసం పూర్తిస్థాయిలో నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, డీఎస్పీ నాగర్‌కర్నూల్

నిర్లక్ష్యంగా పోలీస్‌శాఖ

మండలంలో కొన్నేళ్లుగా గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతుంటే స్థానిక పోలీస్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదులు వస్తే గాని చర్యలు తీసుకునే పరిస్థితి లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గంజాయి మూలాలు తెలిసినా కాని తమకెందుకులే అన్నట్టుగా వారు వ్యవహరిస్తున్నారు. గంజాయి నిర్మూలనలో స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, అందువల్లే హత్యల వరకు దారి తీస్తున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఎంపీ డీకే అరుణ ఇంటి ముట్టడి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పార్లమెంట్ సమావేశంలో 'నీట్' అవకతవకలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీ డీకే అరుణ ఇంటిని ముట్టడించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని.. ప్రశ్నపత్రం లీకేజీతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. వెంటనే నీట్ పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో నీట్ పరీక్ష రద్దుపై తీర్మానం చేయాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కాగా, ఎంపీ డీకే అరుణ ఇంటిని ముట్టడించిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి, వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో భరత్, నందు తదితరులు ఉన్నారు.


విద్యార్థి సంఘాల నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ప్రైవేటు ఆస్పత్రుల్లో విస్తృత తనిఖీలు

- నిబంధనలు పాటించని ఆరు ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు


ఎల్‌వీ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

పాలమూరు: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లలో శనివారం వైద్యారోగ్యశాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సంరక్ష ఆస్పత్రి, ఆదిత్య కిడ్నీ సెంటర్, వంశీ ఫిజియోథెరఫి, తిరుమల డెంటల్ క్లినిక్, కల్యాణి డెంటల్, ఇషా ఆస్పత్రి, నక్షత్ర, పాలమూరు కంటి ఆస్పత్రి, ఎల్‌వీ ఆస్పత్రి, భగీరథ పాలిక్లినిక్, మనీషా క్లినిక్‌లలో ఆస్పత్రి రిజిస్ట్రేషన్, సేవలకు సంబంధించిన ధరల పట్టికలు, అగ్నిమాపక పరికరాలు తదితర అంశాలను డీఎంహెచ్‌ఓ కృష్ణ ఆధ్వర్యంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్‌వీ ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న నర్సులు విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సాధారణంగా అయితే శిక్షణ పూర్తయి సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే విధులు నిర్వహించాలి. ఇక భగీరథ పాలిక్లినిక్, మనీషా క్లినిక్, వంశీ ఫిజియోథెరఫి, తిరుమల డెంటల్, కల్యాణి డెంటల్ ఆస్పత్రుల్లో ధరల పట్టికలు లేకపోవడాన్ని గుర్తించారు. నిబంధనలు పాటించని ఆరు ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 416 మంది ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద రిజిస్ట్రేషన్ చేసుకుని ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డెంటల్, ఫిజియోథెరఫి, స్కానింగ్ సెంటర్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా సెంటర్‌లలో సేవలు పొందే వ్యక్తులకు వాటి ధరల గురించి స్పష్టంగా అర్థమయ్యే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 40 ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. 5 ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ప్రోగ్రాం అధికారి డా.భాస్కర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు, సుభాష్ చంద్రబోస్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో భారీవర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాలాలు, మురుగుకాలువలు పొంగి పొర్లాయి. ఉద్యోగులు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. వరుసగా మూడు రోజుల పాటు వర్షం కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది.

ఐదోరోజు కొనసాగిన వారోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీఅన్నమయ్య వాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీవనమాలి పాదపద కవితా తాతా సంకీర్తనా చతుర్థ వారోత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరాయి. గద్వాల చంద్రశేఖరరావు ఆలపిస్తున్న అన్నమయ్య సంకీర్తనాలు అలరిస్తున్నాయి. వచ్చేనెల 1 వరకు కార్యక్రమం సాగనుంది. సామవేదం వెంకట మురళీకృష్ణ, లక్ష్మీమనోహర్ రావు, పరిమళ రమణారావు, విజయ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రుణం సొంత ఖాతాలకు బదిలీ

- సింగిల్‌విండో చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

జడ్చర్ల: బాదేపల్లి సహకార సంఘానికి సంబంధించి నాబార్డు మంజూరు చేసిన రుణంతో పాటు సంఘానికి చెందిన నిధులను చైర్మన్ సుదర్శన్‌గౌడ్ తన ఖాతాతో పాటు అనుయాయుల ఖాతాలకు మళ్లించారని కార్యదర్శి యాదగిరి శనివారం కలెక్టర్ విజయేంద్రకు ఫిర్యాదు చేశారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో నాగసాల శివారులో గోదాం నిర్మాణం కోసం నాబార్డు రూ.1,47,22,160 రుణం మంజూరు చేసింది. సంఘం నుంచి తన వాటాగా రూ.31,27,281 కలిపి మొత్తం రూ.1,78,49,441 వ్యయంతో పనులు చేపట్టారు. నిధుల చెల్లింపు మాత్రం నిబంధనల మేరకు కాలేదని చైర్మన్ తన ఇష్టానుసారంగా వ్యక్తి గత ఖాతాతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, డ్రైవర్ ఖాతాలకు బదిలీ చేశారని కార్యదర్శి పేర్కొన్నారు. అంతేకాక హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ బంగారు దుకాణం ఖాతాలోకి రూ.10 లక్షలు బదిలీ చేశారని తెలిపారు. నాగసాల శివారులోని సర్వే నంబర్ 80లో గోదాం నిర్మాణానికి ప్రభుత్వం 5.36 ఎకరాలు కేటాయించగా తాను సొంతంగా భూమి కొనుగోలుకు రూ.50 లక్షలు, కార్యాలయ నిర్మాణం కోసం రూ.20 లక్షలు వెచ్చించినట్లు ప్రచారం చేసుకుంటున్నారని, ఇందుకు సంబంధించిన డబ్బులపై విచారించాలని కోరారు. గోదాం నిర్మాణానికి విడుదల చేసిన నిధులకు సంబంధించి ఓచర్స్ తనకు అప్పగించాలని కోరడంతో తనపై కక్ష గట్టి తనకు సంబంధం లేకుండా ఇతరులు విక్రయించిన ఎరువుల బస్తాలలో అక్రమాలు జరిగాయని తనపై నేరం మోపుతు తనను విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కలెక్టర్‌కు కోరారు. కాగా కార్యదర్శి ఆరోపణలను సింగిల్‌విండో చైర్మన్ కొట్టి పారేశారు. తన సొంత డబ్బుతో భూమి కొనుగోలు చేసినట్లు ఎక్కడా చెప్పలేదని, ఇక గోదాం నిర్మాణ పనులను తానే సొంతంగా చేయించానని, ఇందుకు సంబంధించిన నిధులను తనకు ఇష్టమైన వారి ఖాతాలకు బదలాయించి ఆ డబ్బుతో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే అలా నిబంధనలు ఉన్నాయా లేదా అన్నది సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది.

వాగ్దేవీలో అవగాహన సదస్సు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్డియాలజిస్టు ప్రణవ్, పల్మనాలజిస్టు నితిన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. సీపీఆర్ ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నం చేయవచ్చని, ప్రతి ఒక్కరు దానిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫోన్‌కు దూరంగా ఉండి, చదువులపై శ్రద్ధ చూపాలని అప్పుడే తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి ఐఐటీ, నీట్ ఇన్‌చార్జ్ పావని, షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న పాఠశాల బస్సు

- నలుగురు విద్యార్థులకు గాయాలు

పెబ్బేరు రూరల్: ప్రైవేట్ పాఠశాల బస్సు చెట్టును ఢీకొనడంతో నలుగురు విద్యార్థులకు శనివారం గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. వనపర్తి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల నుంచి సాయంత్రం బస్సులో 20 మంది విద్యార్థులు వారి గ్రామాలకు బయలుదేరారు. డ్రైవరు మద్యం మత్తులో బస్సును అతివేగంగా నడుపుతూ మండలంలోని నాగవరం శివారులోని బాపన్‌గేరి మలుపు వద్ద బస్సు అదుపు తప్పి చింతచెట్టును ఢీకొంది. దీంతో నలుగురు విద్యార్థులకు గాయాలుకాగా, మిగతావారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకుని గాయపడిన విద్యార్థులను పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవరు వేనుగోపాల్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వాహనం బోల్తా: 30 మందికి గాయాలు


బోల్తా పడిన వాహనం

కోడేరు: వాహనం బోల్తా పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గొల్ల బద్దుల రాము బొలెరో వాహనంలో డ్రైవర్ మహేష్ తాడూర్ మండలం యాదిరెడ్డిపల్లికి పత్తి చేనులో కలుపు తీసేందుకు పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రం చెందిన 22 మంది కూలీలను, కోడేరులో మరో 12 మంది కూలీలను వాహనంలో ఎక్కించుకుని బయలుదేరాడు. కోడేరు సమీపంలో డంపింగ్ యార్డ్ వద్ద ద్విచక్ర వాహనంను తప్పించపోయి వేగంగా బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. మహాసముద్రం చెందిన అలివేల, శీలం చెన్నమ్మ, బెల్లబాలమ్మ, బోయ్య బిచ్చమ్మ, జయలక్ష్మి, బక్కమ్మ, పార్వతమ్మ, భారతమ్మ, సూజాత, చుక్క నాగేంద్రం, శీలం కృష్ణయ్య, డ్యాగలింగమ్మ, ముష్టి చెన్నమ్మ, బెల్ల తిరుపతమ్మ, బెల్ల రాములమ్మ, బోయ్య చంద్రమ్మ, సువర్ణ, బక్కచిట్టి, బెల్ల పార్వతమ్మ, అలువల వెంకటయ్య, సైదులమ్మకు గాయాలు కాగా కోడేరుకు చెందిన చిట్టమ్మ, సరస్వతి, చుక్క నాగమ్మ, పుష్పలత, కాశమ్మ, బిచ్చమ్మ, కృష్ణవేణి, చంద్రమ్మ, రాధమ్మ, చుక్క సరస్వతి, విమల, రాధికలకు మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో అరిగెల చిట్టమ్మ, బెల్ల బాలమ్మ కాలు విరిగింది. శీలం చెన్నమ్మకు చేయి విరిగింది. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.


ట్రెజరీ కార్యాలయంలో బ్యాటరీలు చోరీ

జడ్చర్ల: పట్టణంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం తలుపు తాళాలు విరగ్గొట్టి చొరబడ్డారు. ఫైళ్లను చిందర వందర చేశారు. కార్యాలయంలో గల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ట్రెజరీ అధికారి విజయ్‌భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

మూడు వారాల్లో
రూ.7 వేల కోట్ల అప్పు

ఆర్బీఐకి వెల్లడించిన చంద్రబాబు ప్రభుత్వం

- ఎల్లో మీడియాకు ప్రతి మంగళవారం బాబు అప్పులు కనిపించడం లేదా?
- లేక ఈ అప్పులే సంపద సృష్టిలా కనిపిస్తోందా?
- గతంలో వైఎస్ జగన్ సర్కార్‌పై ప్రతి మంగళవారం అప్పు అంటూ విషం కక్కిన ఎల్లో మీడియా
- ఇప్పుడు బాబు అంటే ఇష్టం కాబట్టి అప్పు ఊసెత్తని వైనం
- ఈ నెల 25న రూ.2 వేల కోట్లు, వచ్చే నెల 2న రూ.5 వేల కోట్ల అప్పు



సాక్షి, అమరావతి: ప్రతి మంగళవారం అప్పు చేయందే గడవదంటూ ఇన్నాళ్లూ వైఎస్ జగన్ సర్కారుపై రాసిందే పదే పదే రాస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా విషం కక్కాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు ప్రతీ మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? అని అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బాబు సర్కారు ప్రతి మంగళవారం చేస్తున్న అప్పులు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాకు సంపద సృష్టిస్తున్నట్లు కనిపిస్తోందా.. అంటూ ఎద్దేవా చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పులు చేయడానికి వెసులు బాటు కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఆర్‌బీఐ వేలం వేసే తేదీలను ముందుగానే ప్రకటిస్తుంది. ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత మేర అప్పు చేస్తాయో.. ఎన్ని సంవత్సరాల కాల వ్యవధిలో ఆ అప్పు తీరుస్తాయో ఆర్‌బీఐకి తెలియజేస్తాయి. అదే తరహాలో గత వైఎస్ జగన్ సర్కారు పరిమితికి లోబడి అప్పులు చేస్తే.. ప్రతి మంగళవారం అప్పు అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తూ కథనాలు వండి వారుస్తూ నానా యాగీ చేశాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు 20 రోజుల వ్యవధిలోనే రూ.7000 కోట్లు అప్పు చేసినా.. అదీ ప్రతి మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. దాని గురించి ఒక్క ముక్క రాయడం లేదు. అంటే తమకు ఇష్టమైన చంద్రబాబు అధికారంలో ఉన్నందున, ఎన్ని అప్పులు చేసినా.. ఆ పత్రికలకు సంపద సృష్టిలా కనిపిస్తుందేమోనని ఉన్నతాధికారి ఒకరు ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అంటే ఇష్టం లేనందున పరిమితికి లోబడి అప్పులు తెచ్చినా సరే ప్రతి మంగళవారం అప్పు చేయనిదే గడవదంటూ పెద్ద నేరం చేసినట్లు నిత్యం ఆ పత్రికలు కథనాలు రాసినట్లు ఇప్పుడు స్పష్టం అవుతోందని ఆ అధికారి విశ్లేషించారు.

సంపద సృష్టి ఏమైందో!

వైఎస్ జగన్ సర్కారు అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాతో పాటు చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్‌లు విషం కక్కారు. చంద్రబాబు అయితే ఒక అడుగు ముందుకు వేసి అప్పులు చేయడం కాదు.. సంపద సృష్టిస్తానని, ఆ సంపద ఎలా సృష్టించాలో తనకే తెలుసంటూ ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ఇంత గట్టిగా బల్లగుద్ది చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తామంటూ ఆర్‌బీఐకి స్పష్టం చేసింది. ఇదే సందర్భంలో ప్రతి మంగళవారం అప్పులతో పాటు ఎంత సంపద సృష్టిస్తారో కూడా చెబితే బాగుంటుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నెల 25వ తేదీన సెక్యూరిటీల వేలం ద్వారా రూ.2,000 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు.. వచ్చే నెల 2వ తేదీన మంగళవారం మరో రూ.5,000 కోట్లు అప్పు చేస్తోంది. వచ్చే నెల 2వ తేదీన రూ.1,000 కోట్లు తొమ్మిది సంవత్సరాల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 12 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 17 ఏళ్ల కాల వ్యవధికి, ఇంకో రూ.1,000 కోట్లు 21 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 24 ఏళ్ల కాల వ్యవధికి సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పు చేయనుంది. ఆ తర్వాత మంగళవారం కూడా అప్పు చేయనున్నట్లు చంద్రబాబు సర్కారు ఆర్‌బీఐకి తెలియజేసింది.

రెడ్‌బుక్ ఉన్మాదమిది

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ శ్రేణుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ప్రధానంగా గ్రామాల్లో, ఎస్సీ, ఎస్టీ వాడల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. జేసీబీలతో ఇళ్లను కూలదోస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులని కూడా చూడకుండా చితకబాదుతుండటం ఊరూరా కనిపిస్తోంది. శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారు.. పగలగొడుతున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటలకు అందరూ చూస్తుండగానే టీడీపీ వర్గీయులు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇదేం కక్ష సాధింపు? గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎవరైనా ఇలా చేశారా? అధికారం చేజిక్కించుకుంటే ఇలా దాడులు చేయడానికి, ఆస్తులు ధ్వంసం చేయడానికి లైసెన్స్ వచ్చినట్లా? లేక అధికారంతో పాటు హిస్టీరియా ఏమైనా వచ్చిందా? రెడ్ బుక్.. రెడ్ బుక్.. అంటూ లోకేశ్‌కు వచ్చిన పూనకం తాలూకు ఉన్మాదమే ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులకూ నరనరాన ఎక్కినట్లుంది. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చడమే మీ ఉన్మాద లక్ష్యం అయితే.. ప్రజాగ్రహ జ్వాల ఉవ్వెత్తున ఎగిసి పడటం ఖాయం. ఆ సెగలో మాడి మసి అవుతారో.. లేక పద్ధతి మార్చుకుని బుద్ధిగా పాలన సాగిస్తారో మీరే తేల్చుకోండి.



అద్దేపల్లిలో టీడీపీ నాయకులు పెట్రోల్ పోసి తగలపెట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం

- బాపట్ల జిల్లా అద్దేపల్లిలో పేట్రేగిన టీడీపీ నాయకులు
- పెట్రోల్ పోసి వైఎస్సార్ విగ్రహానికి నిప్పు
- తమ జెండా స్థూపం పగులగొట్టారంటూ టీడీపీ రివర్స్ ఫిర్యాదు
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- దళితవాడలో ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు

అద్దేపల్లి (భట్టిప్రోలు)/సాక్షి ప్రతినిధి బాపట్ల: టీడీపీ మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా ఉన్న వేమూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు బరితెగించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధి అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అందరూ చూస్తుండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విగ్రహం ముప్పావు భాగానికి పైగా దగ్ధమైంది. దీంతో దళితవాడలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే, వైఎస్సార్ విగ్రహానికి సమీపంలో ఉన్న టీడీపీ జెండా దిమ్మెను వైఎస్సార్‌సీపీ వారు పగులగొట్టారని, అందుకు ప్రతీకారంగా వైఎస్ విగ్రహాన్ని తగులబెట్టినట్లు టీడీపీ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. కానీ, టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే తమను రెచ్చగొట్టేందుకు జెండా దిమ్మెను కొద్దిగా పగులగొట్టుకుని ఆ సాకుతో వైఎస్ విగ్రహాన్ని కాల్చివేశారని వైఎస్సార్‌సీపీ నేతలు వాదిస్తున్నారు.

ఇరువర్గాలూ పరస్పర ఫిర్యాదులు

జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం టీడీపీ అరాచకపర్వం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా టీడీపీ నేతలు దాడులు చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిలో టీడీపీ జెండా దిమ్మెలను పగులగొట్టే పరిస్థితి వైఎస్సార్‌సీపీ నేతలకు లేదన్నది టీడీపీ నేతలకూ తెలుసు. కాకపోతే ఏదో సాకుచూపి విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టీడీపీ కార్యకర్తలే వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఏడు మందిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం చేశారంటూ టీడీపీ నేతలు ప్రతిగా 14 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు : ఎస్‌ఐ

ఈ ఘటన సమాచారం అందుకున్న వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్‌ఐ కాసుల శ్రీనివాసరావు, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కూడా భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా, వైఎస్సార్ విగ్రహం దగ్ధం చేసిన ఏడుగురిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై 435, 427, 507 ఆర్/34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మరోవైపు టీడీపీ జెండా దిమ్మను ధ్వంసం చేసినట్లు ఆ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దళితవాడలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఇదిలా ఉంటే..

విగ్రహాలు ధ్వంసం హేయం : మేరుగు

స్ఫూర్తిని నింపిన మహనీయుల విగ్రహాల ధ్వంసం, దహనం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీమంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విగ్రహం దహనం విషయం తెలుసుకున్న ఆయన అద్దేపల్లిని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. టీడీపీ దురాగతాన్ని ఖండించారు.

హుటాహుటిన మరొక విగ్రహం ఏర్పాటుకు యత్నం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శనివారం రాత్రి అద్దేపల్లి విచ్చేసి కాలిపోయిన వైఎస్ విగ్రహాన్ని పరిశీలించారు. అక్కడే వైఎస్సార్ మరో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విగ్రహం ఏర్పాటు పూర్తయ్యే వరకూ ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మౌన దీక్ష చేశారు. దళితవాడ ప్రజలు అండగా వచ్చి ఆయనకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. రాత్రి 10గంటల ప్రాంతంలో పోలీసులు అశోక్ బాబు దీక్షను భగ్నంచేసి ఆయన్ను రేపల్లె తరలించారు. అక్కడా ఆయన పోలీసు వాహనం దిగకుండా దీక్ష కొనసాగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు అని చూడకుండా పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేశారు. విగ్రహాన్ని దగ్ధం చేయడం గ్రామ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని.. చంద్రబాబు రాక్షస పాలనకు ఇది పరాకాష్టని అశోక్‌బాబు మండిపడ్డారు.

కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు

భారత క్రికెట్ జట్టుకు జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న భారత క్రికెట్ జట్టుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు సొంతం చేసుకుందని ప్రశంసించారు. టోర్నీ ఆద్యంతం సమష్టి కృషితో భారత జట్టు విజయాలు సాధించిందన్నారు. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో తీవ్ర నిరాశకు గురైన అభిమానులకు ఈ విజయం గొప్ప ఊరటనిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. జట్టును విజయవంతంగా నడిపించడంలో అతడు చక్కటి నాయకత్వాన్ని ప్రదర్శించాడని కొనియాడారు. రానున్న రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని చాంపియన్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో అరాచకం ▸ రాజ్యమేలుతోంది

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయి

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి

- పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి
- శాంతిభద్రతలు క్షీణించాయి.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- టీడీపీ అరాచకాలను అరికట్టాలని గవర్నర్‌కు వినతి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నల్లమలలో జంగిల్ సఫారీ రద్దు

అచ్చంపేట: నల్లమల పరివాహక ప్రాంతం అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో మూడు నెలల పాటు సఫారీ టూర్‌ను రద్దు చేస్తున్నట్లు డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి శనివారం తెలిపారు. పెద్ద పులులు సంతానోత్పత్తికి ఏట వర్షాకాలం జూలై 1వ తేదీ మొదలుకొని సెప్టెంబర్ 30వ తేదీ వరకు అనుకూలం ఉంటుందని, ఈ సమయంలో ఎలాంటి జన సంచారం వాహనాల అలజడి లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నల్లమల పరివాహక ప్రాంతంలో అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం 2,611 చదరపు కిలో మీటర్లుగా విస్తరించి ఉండగా, ప్రస్తుతం 30 పెద్ద పులులు, 165 చిరుతలు, 2,500 పైగా ఇతర రకాల వన్యప్రాణులు జీవిస్తున్నట్లు ఘణాంగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధాన రహదారి గుండా వాహనదారులు గంటకు 30 కిలో మీటర్ల వేగానికి మించకుండా వెళ్లాలని తెలిపారు. సెప్టెంబర్ చివరి వారంలో వర్షాల పరిస్థితి, సఫారి రహదారుల అనుకూలతను బట్టి అక్టోబర్ నెలలో జంగిల్ సఫారీ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగ కొనసాగుతుంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 683 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శనివారం నాటికి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. లిఫ్టుల ద్వారా 715 క్యూసెక్కులు వదుతున్నారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

15 అడుగులకు కోయిల్‌సాగర్ నీటి మట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 15 అడుగులకు చేరింది. జూరాల నుంచి ఒక పంపును ప్రారంభించి ఎత్తిపోతల ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. రెండు వారాల క్రితం వరకు కేవలం 10.6 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 4.6 అడుగుల మేర పెరిగి 15 అడుగులకు చేరుకుంది. జూలై మూడో వారం వరకు మరో పది అడుగుల నీటిమట్టం పెరిగితే వానాకాలం పంటలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. గడిచిన రెండేళ్లలో జూలై చివరి వారంలో పంటలకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు అలుగు స్థాయి నీటిమట్టం 26.6 అడుగులు కాగా గేట్ల స్థాయి నీటి మట్టం 32.6 అడుగులుగా ఉంది. అలుగు స్థాయికి చేరాలంటే మరో 11.6 అడుగుల నీరు అవసరం, గేట్ల స్థాయికి చేరాలంటే 17.6 అడుగుల నీరు చేరాలి.

జడ్చర్ల చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం!



కలెక్టర్ విజయేందిర బోయికి లేఖను అందిస్తున్న కౌన్సిలర్లు

- జడ్చర్ల మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు ఝలక్
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాస లేఖను కలెక్టర్‌కు అందజేసిన కౌన్సిలర్లు

జడ్చర్ల టౌన్: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసానికి దిగారు. శనివారం నిర్వహించిన సాధారణ సమావేశం బహిష్కరించి అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్ విజయేందిర బోయికి 26మంది సంతకాలతో కూడిన లేఖను అందజేశారు. పరిశీలించిన కలెక్టర్ త్వరలోనే అవిశ్వాసం కోసం తేదీని తెలియజేస్తానని సమాధానం ఇచ్చారు.

ఒంటెద్దు పోకడలతోనే..

సాధారణ సమావేశాన్ని శనివారం కౌన్సిలర్లు బహిష్కరించి, కార్యాలయం గేటువద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సమావేశం ఎజెండా తయారీలో తమతో ఏమాత్రం సంప్రదించకుండా చైర్‌పర్సన్, కమిషనర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. వార్డులలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని, పలుమార్లు ఇదే విషయాన్ని చైర్‌పర్సన్‌కు వివరించినా ఏమాత్రం పట్టించుకోకుండా అలాగే ప్రవర్తిస్తున్నారని తెలిపారు. నీటి సమస్య కోసం రూ.45లక్షలు ఖర్చుపెట్టినట్లుగా చూయించారని ఎక్కడ చేశారో తెలియదని కౌన్సిలర్లు మండిపడ్డారు. వాహన అలవెన్స్ తీసుకంటూ ఏనాడు వార్డుల్లో పర్యటించకుండా ఉన్నారన్నారు. సమావేశం బహిష్కరించటంతోపాటు ఎజెండా పత్రాలను చించేశారు. నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌ను కలిసి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస లేఖను అందజేశారు. వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారిక, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాసానికి మద్దతు పలికారు.

కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ మధ్య సమన్వయలోపం

మున్సిపాలిటీలో 27మంది కౌన్సిలర్లు ఉండగా 23మంది బీఆర్‌ఎస్, ఇద్దరేసి చొప్పున బీజేపీ కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్‌గా బీసీ మహిళకు రిజర్వు కావటంతో దోరేపల్లి లక్ష్మిని ఎన్నుకున్నారు. వైస్‌చైర్‌పర్సన్‌గా పాలాది సారికను ఖరారు చేశారు. పాలకవర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ల మధ్య సమన్వయం లోపించింది. ఓస్థాయిలో విభేదాలు తారాస్థాయికి చేరుకోవటంతో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పలుమార్లు చర్చలు చేసినా ఫలించలేదు. ఎన్నికలు ముగియటం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిరుథ్‌రెడ్డి విజయం సాధించటంతో సమస్య కొంత సద్దుమణిగింది. ఈ క్రమంలోనే ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. పాలకవర్గానికి ఈ ఏడాది మే 5తో మూడేళ్లు పూర్తికావటంతో అవిశ్వాసం పెట్టేందుకు ముందుకు వచ్చారు. చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో కొంత జాప్యం జరిగింది.

లాభదాయక పంటలు పండించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: రైతులు లాభదాయక పంటలు పండించి, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం నిర్వహించిన 'కందిసాగు విస్తీర్ణం పెంచుదాం' అనే అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతులు పప్పు దినుసులు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో కంది పప్పునకు ఎంతో డిమాండ్ ఉందని.. జిల్లాలో విస్తారంగా కందులు పండించి, విదేశాలకు ఎగుమతి చేసేలా రైతాంగం ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏడీఆర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో నేలలు కందిసాగుకు అనుకూలంగా ఉన్నాయని, రైతులు కందిసాగుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు భరత్ భూషణ్‌రావు, వాణిశ్రీ, పూర్ణచందర్ రెడ్డి, రవిచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి



నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం గనుల ప్రైవేటీకరణలో భాగంగా రాష్ట్రంలో సింగరేణికి కేటాయించాల్సిన బొగ్గు గనులను బహిరంగ వేలం పేరుతో ప్రైవేట్ - కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తుందని, దాన్ని నిలిపివేసి సింగరేణికే కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. శనివారం బొగ్గు గనుల బహిరంగ వేలాన్ని నిరసిస్తు సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నుండి నేటి వరకు దేశంలోనే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేయడానికి, కార్పొరేట్‌లకు దేశ సంపద కట్టబెట్టడమే బిజెపి విధానమన్నారు. అదేవిధంగా సింగరేణి ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు సింగరేణి బొగ్గు బావుల వేలంపై ఆందోళన పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్మికులు, ప్రజలు, విద్యార్థులు, యువత, మేధావులు అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, గోపాల్, బాల్‌రామ్, అంజిలయ్యగౌడ్, నరహరి, పవన్, ప్రకాష్ పాల్గొన్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

పాలమూరు: దివ్యాంగులను ఎవరూ చిన్నచూపు చూడవద్దని.. వారికి ప్రోత్సాహం అందిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మమానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగ పిల్లలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బ్రహ్మమానసిక పాఠశాలలో విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తుండటంపై అభినందనలు తెలిపారు. యుక్త వయసు పిల్లలు ల్యాప్‌టాప్ ద్వారా శిక్షణ పొందుతూ, మంచి నైపుణ్యం పొందుతున్నారని చెప్పారు. లీగల్ గార్డియన్‌షిప్ ద్వారా దివ్యాంగ విద్యార్థులు అన్ని ప్రభుత్వ పథకాలు పొందేవిధంగా కృషి చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల చట్టం, చైల్డ్ రైట్స్, లీగల్ సర్వీసెస్ యాక్ట్‌తో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, వ్యవస్థాపకుడు గన్నోజు చంద్రశేఖర్, అంజనీశ్వరి, నాగరాజు పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే కఠిన చర్యలు



నారాయణపేట: జిల్లాలో బాలలను ఎవరైనా బడిమానిపించి వెట్టిచాకిరీ చేయిస్తే అది నేరంగా పరిగణించబడుతుందని అందుకు కారకులైన వారిపై కఠినంగా వ్యవహరించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని డీఎస్పీ ఎన్.లింగయ్య హెచ్చరించారు. శనివారం జూలై 1 నుండి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్- 10 నిర్వహణ పై వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ నియమించిన పోలీస్ సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షించారు. 18 ఏళ్లలోపు బాలలు బాలకార్మికులుగా పని చేస్తు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులు లేని జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని, లేబర్ ఆఫీసర్ రాజ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు కండీషన్‌లో ఉంచుకోవాలి



పోలీసు వాహనాలను పరిశీలించి డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట: శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులకు వాహనాల ప్రాధాన్యత ఎంతో అవసరం ఉంటుందని..పోలీస్ వాహనాలను ఎప్పుడు అందుబాటులో, కండీషన్‌లో ఉంచుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. శనివారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని గ్రౌండ్‌లో జిల్లా పరిధిలోని పెట్రోల్ కార్, పోలీసు వాహనాలను ఎస్పీ పరిశీలించారు. వాహనాల మెయింటెనెన్స్‌ను అడిగి తెలుసుకొని వాహనాలు ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి రిపేరు ఉన్నా వెంటనే చేయించాలని, ఆయిల్ సర్వీసింగ్ చేయించాలని, రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించే పెట్రోలింగ్ వాహనాలను నిరంతరం తిరిగేలా చూడాలనివాటికి జీపీఎస్ కనెక్ట్ చేయాలన్నారు. ప్రతిరోజు సమయానుకూలంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయా లేవా అని చెక్ చేయాలని సూచించారు. పోలీస్ వాహన డ్రైవర్లకు వర్క్ షాప్ నిర్వహిస్తూ డ్రైవింగ్‌పై, సైన్ బోర్డ్స్‌పై, వాటి మెకానిజంపై అవగాహన కల్పించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు పాటించాలని, డ్యూటీలో ఉన్న డ్రైవర్ సీట్ టర్నోట్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు నాగేంద్రుడు, సిఐ రామ్ లాల్, నరసింహ,పోలీసు వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

శనైశ్వరుడికి ప్రత్యేక పూజలు

నాగర్‌కర్నూల్: నందివడ్డెమాన్‌లో జైష్ట్యాదేవి సమేత శనైశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మంత్రోచ్చారణల మధ్య భక్తులు తిలతైలాభిషేకాలు చేశారు. అనంతరం శివాలయాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



జిల్లా ఆస్పత్రికి రూ. 50 లక్షలు మంజూరు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రి అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ఆస్పత్రిలో పలు నిర్మాణాలతో పాటు వైద్య పరికరాల ఏర్పాటు కోసం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.